ఘనంగాసద్దుల బతుకమ్మ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /అక్టోబర్ 18 /అక్షరం న్యూస్:

ములకలపల్లి మండలం పొగళ్లపల్లి అంబేద్కర్ నగర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఘనంగా,ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు.రాత్రి వేళ గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలో మహిళలు,చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ కోలాహలంగా జరుపుకున్నారు సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి నిదర్శనమన్నారు.ఆడపడుచులందరూ కలిసికట్టుగా ఇలాంటి పండుగలు జరుపుకోవడం వల్ల గ్రామంలో ఐక్యత,సోదరభావం పెరుగుతుందన్నారు.గ్రామ అభివృద్ధితో పాటు మన సంస్కృతిని కాపాడుకోవడం కూడా మన బాధ్యత అని,ప్రతి ఏటా ఇలాగే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.వేడుకలకు అంబేద్కర్ నగర్ కాలనీ ఆడపడుచుల అందరికీ కొట్టే శంకర్ కుమార్తెలు చేతుల మీదుగా సార పంచడం జరిగినది వచ్చిన మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొట్టెశంకర్ యూత్ నాయకులు మహిళలు చిన్నారులు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



సద్దుల బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న మాజీ జడ్పిటిసి బత్తుల అంజి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి /అక్టోబర్ 18 /అక్షరం న్యూస్:

ములకలపల్లి అంబేద్కర్ నగర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఘనంగా,ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు.రాత్రి వేళ గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలో మహిళలు,చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ కోలాహలంగా జరుపుకున్నారు.అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా చంద్రలేఖ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి నిదర్శనమన్నారు.ఆడపడుచులందరూ కలిసికట్టుగా ఇలాంటి పండుగలు జరుపుకోవడం వల్ల గ్రామంలో ఐక్యత,సోదరభావం పెరుగుతుందన్నారు.గ్రామ అభివృద్ధితో పాటు మన సంస్కృతిని కాపాడుకోవడం కూడా మన బాధ్యత అని,ప్రతి ఏటా ఇలాగే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.వేడుకలకు వచ్చిన మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మరియు జిల్లా నాయకులు బత్తుల అంజి సర్పంచ్ కొర్స చంద్రలేఖ గాడి తిరుపతి రెడ్డి శనగపాటి రవి మేకల నరి పాత్రికేయులు గంటా వెంకటేశ్వర్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి సుమిత్ గుడ్ల రాజు చెక్క శ్రీనివాస్ ఖమ్మంపాటి ప్రసాద్ చక్క శ్రీను నందిపాటి ముతేశ్వర రావు గొల్లమందల నారాయణ సిద్దిల వెంకటేష్ ఖమ్మంపాటి గణేష్ యూత్ కమిటీ సభ్యులుగ్రామ పెద్దలు మరియు తదితర గ్రామ మహిళలు,యువతులు,చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రకృతితో మమేకమైన మహోన్నత పండుగ

- శ్రమజీవుల ఐక్యతకు పల్లె సంబరాలే నిదర్శనం.
- పూల వేడుకలతో గ్రామీణ సంస్కృతికి జీవం.
- సంప్రదాయాలను భావితరాలకు అందించాలి.
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 18 / అక్షరం న్యూస్ –: : పూలను పూజించి ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని, గ్రామీణ శ్రమజీవుల ఐక్యతకు ఈ సంబరాలు నిదర్శనమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, కొత్తగూడెం పట్టణ పరిధిలోని బస్తీలు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆటపాటలతో జరుపుకుంటున్న వేడుకలను ఆయన నేరుగా సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సీబీ నగర్, పాత కొత్తగూడెం, విద్యానగర్, శ్రీనగర్ కాలనీలలో ఏర్పాటు చేసిన ఘాట్లను సందర్శించి, సామూహిక బతుకమ్మల నిమజ్జనోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయని, ఆడపడుచుల ముఖాల్లో ఆనందం నింపే ఇలాంటి మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని, పండుగ సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ప్రజాప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 18 / అక్షరం న్యూస్ –:

అక్టోబర్ 19 వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని ఆయన సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ కార్యాలయం భద్రాచలం మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. కావున ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

మా తల్లి బతుకమ్మ... పోయి రావమ్మా..అంటూ వీడ్కోలు

- ఘనంగా ముగిసిన బతుకమ్మ వేడుకలు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరంన్యూస్)అక్టోబరు 18: తొమ్మిది రోజుల పాటు ఆటా.. పాటలతో సాగిన బతుకమ్మ వేడుకలు ఆదివారం సద్దుల బతుకమ్మ పర్వంతో ముగిశాయి. మండలంలో ఆనందోత్సహాల మధ్య మహిళలు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సద్దుల బతుకమ్మ సందర్భంగా సర్పంచ్ బొల్లం ఉమారాణి, పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో రంగు రంగుల విద్యుత్తు దీపాలతో పాటు డిజే సౌండ్ సిస్టం పాటలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఖిలాషాపూర్, కంచనపల్లి, కోమల్ల, వెల్ది, నిడిగొండ, ఇబ్రహీంపూర్,ఆశ్వరావుపల్లి, కుర్చపల్లి తదితర గ్రామాలలో ఇంటింటి సద్దుల జాతర ఊరంతా మైదానమైంది. మండల కేంద్రంలో సుమారు రెండు గంటల పాటు మహిళలు బతుకమ్మ ఆటను ఉత్సహంగా ఆడి అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి...మా తల్లి బతుకమ్మ పోయి రావమ్మా.. అంటూ వీడ్కోలు పలికారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ఎస్సై భరత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్టీపీసీ పరిసర ప్రాంతాల్లో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు





జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు ఎన్టీపీసీ టౌన్షిప్, టెంపరరీ టౌన్షిప్, కృష్ణా నగర్, అన్నపూర్ణ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుంది. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చడం నుంచి వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడటం వరకు ప్రతి అంశంలోనూ తెలంగాణ సంస్కృతి ప్రతిబింబిస్తుంది. తొమ్మిది రోజులపాటు సాగిన బతుకమ్మ సంబరాలకు సద్దుల బతుకమ్మతో ముగింపు పలకడం ప్రత్యేకతగా నిలుస్తుంది.ఎన్టీపీసీ పరిసర ప్రాంతాల్లోని వివిధ కాలనీల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, సంప్రదాయ పాటలు, మహిళల కోలాటాలు, నృత్యాలతో కాలనీలన్నీ సందడిగా మారాయి. స్థానికంగా నివసిస్తున్న వివిధ ప్రాంతాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని మరోసారి చాటిచెప్పింది.

సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు.. హాజరైన ఎమ్మెల్యే దంపతులు



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రామగుండం ఏరియా-1 యాజమాన్యం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఆదివారం గోదావరి కళా ప్రాంగణం, జీఎం కాలనీ మైదానంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలతో సందడి చేశారు.ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్, సింగరేణి రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, సింగరేణి సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి వేడుకలను సమిష్టిగా జరుపుకోవడం ద్వారా తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకోవడం అభినందనీయమన్నారు.జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు సింగరేణి యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇలాంటి వేడుకలు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయతను, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.మహిళలు వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉత్తమంగా పేర్చిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మహిళలకు లక్కీ డ్రా ద్వారా ప్రత్యేక బహుమతులను కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జీఎం కాలనీ వాసులు, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ బి.రవీంద్ర నాయక్



జనగామజిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 18 : వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ బి.రవీంద్ర నాయక్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ బి.రవీంద్ర నాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలు అందుతున్న ఆరోగ్య సేవలు, మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలపై వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సిద్దార్థ రెడ్డి, పీహెచ్ సి వైద్యాధికారి కమలహాసన్, సిహెచ్ ఓ రామ్ కిషన్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగురంగుల పూలతో బతుకమ్మల పేర్చి.. ఆటపాటలతో సందడి



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ అక్టోబర్ 18/అక్షరం న్యూస్:-

భీమదేవరపల్లి మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. పండుగ వాతావరణంతో మండల కేంద్రంలో సందడి నెలకొంది.వేడుకలను పురస్కరించుకుని స్థానిక సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో వీధుల్లో రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వివిధ రంగుల లైట్ల వెలుగులతో వీధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మ వేడుకలు సంప్రదాయ వైభవాన్ని చాటుతూ ఉత్సాహంగా సాగాయి.

బతుకమ్మ వేడుకల్లో మాధురమ్మ సందడి..

- గువ్వలగూడెం, నాయకన్‌గూడెంలో మహిళలతో కలిసి ఆటపాటలు..
- పెరికసింగారంలో చీరల పంపిణీ



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

కూసుమంచి: బతుకమ్మ పండుగ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురమ్మ సందడి చేశారు. శనివారం రాత్రి పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఆమె పలు గ్రామాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి ఆడి, పాడారు. తన నృత్యంతో మహిళల్లో ఉత్సాహం నింపారు.

గువ్వలగూడెం, నాయకన్‌గూడెం మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు మాధురమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు. ఆమెతో కలిసి మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పెరికసింగారం గ్రామంలో గ్రామీణ మహిళలకు చీరలను బహుమతులుగా అందజేశారు.ఈ సందర్భంగా పాలేరు నియోజకవర్గ ప్రజలందరికీ మాధురమ్మ ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, సంతోషాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పలువురు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నారుగూడెంలో వైభవంగా దసరా సంబురాలు..



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

లిదసరా ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శ్రీ మహాలక్ష్మమ్మ కళ్యాణ మండపంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు ఆదివారం రాత్రి కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), బిజెపి జిల్లా నాయకులు ఆపతి వెంకట రామారావు తదితర దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం కృష్ణయ్య, వార్డు మెంబర్ సూదా హనుమంతరావు, మారెళ్ళ దేవేంద్రరావు, పేరసాని నరసింహారావు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాంగులేటి మాధురమ్మ ప్రత్యేక పూజలు..

- భవాని భక్త బృందంతో కలిసి కుంకుమార్చనలు..
- పలుచోట్ల అన్నదానాలు ప్రారంభం..
- మంత్రి పాంగులేటి సారథ్యంలో పాలేరు ఎంతో అభివృద్ధి చెందుతోందని వెల్లడి ..



ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

ఖమ్మం/నేలకొండపల్లి/కూసుమంచి:దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురమ్మ శనివారం రాత్రి పాలేరు నియోజకవర్గంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు, భవాని భక్త బృందంతో కలిసి కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.ఖమ్మంలోని 47వ డివిజన్ ఎఫ్‌సీఐ గోదాం రోడ్డులోని బీరప్పస్వామి దేవస్థానం, 59వ డివిజన్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం, రామాలయం సెంటర్‌లోని ఆలయంలో ఆమె పూజలు చేశారు. ఈ సందర్భంగా మాధురమ్మ మాట్లాడుతూ అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమాల్లో..: ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు నెల్లూరి భద్రయ్య, పలువురు సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



భవాని స్వాములకు అన్నదానం ..





ఖమ్మం/ వైరా అక్టోబర్ 18 (అక్షరం న్యూస్

ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, హర్యాతండా గ్రామంలో ఉప సర్పంచ్ బానోత్ శ్రీను జ్యోతి నాయక్ దంపతులు భవాని స్వాముల కోసం భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భవాని స్వాములకు అన్నదానం చేసి, వారి ఆశీర్వాదాలు తీసుకోవడం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. అన్నదానం మహాదానం అనే గొప్ప సందేశాన్ని చాటుతూ, భక్తులకు సేవ చేయడమే దైవ సేవగా భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవాని మాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జై భవాని మాత భవాని స్వాములకు శరణంఉప సర్పంచ్ బానోత్ శ్రీను ఉజ్యోతి నాయక్ కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.





తల్లాడ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం..

- అధ్యక్షుడిగా గంటల వెంకటాచారి ఎన్నిక
- మండల సంక్షేమానికి కృషి చేస్తాం: నూతన కమిటీ...



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

తల్లాడ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులు రుద్రాక్ష బ్రహ్మం, ఉల్లి శ్రీనివాసరావు, బండారు బ్రహ్మంల సమక్షంలో ఆదివారం మండల కేంద్రంలో నూతన కమిటీ ఎన్నిక ఘనంగా జరిగింది. సంఘం నూతన అధ్యక్షులుగా గంటల వెంకటాచారి, ఉపాధ్యక్షుడిగా సంబోజు పరిపూర్ణాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఇందోజు రవి, కోశాధికారి (ట్రెజరర్)గా బజోజు శేఖర్, మహిళా కార్యదర్శిగా కొత్రోజు సునీత, గౌరవ సలహాదారులుగా తాటికొండ కృష్ణ,రుద్రాక్ష నరసింహచారి,తాటికొండ సత్యనారాయణ అదేవిధంగా కమిటీ మెంబర్లు బండారు నాగర్జున,రుద్రాక్ష నరేంద్ర కుమార్, ఎలగందుల శేఖర్,పోలోజు వెంకటాచారి, తోమాటి రామాచారి ఎన్నికైనట్లు పెద్దలు అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మండలంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, సంఘ బలోపేతానికి అందరి సహకారంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నిబద్ధత చాటారు. తమ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన పెద్దలకు, సంఘ సభ్యులకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, కుల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వైద్య సాంకేతిక విద్యలను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు కొండబోలు సురేష్ ఆర్థిక సహాయం



ఖమ్మం/ వైరా అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

వైరా, పరిసర ప్రాంతాలకు చెందిన వైద్య విద్య, సాంకేతిక విద్యలు అభ్యసిస్తున్న 17 మంది విద్యార్థిని విద్యార్థులకు సోమవరం గ్రామానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయులు కొండబో లు సురేష్ వారి సోదరి కొండబోలు లలిత 2 లక్షల పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైరా గుట్ట బడి ప్రాథమిక పాఠశాల యందు వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా ఏసిపి సారంగపాణి వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీమతి కాపా చంద్రకళ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏసీబీ సారంగపాణి మాట్లాడుతూ విద్య బోలు ధనం పృద్వి లో లేదని విద్య ద్వారా వినయం, ఉన్నత స్థితి లభిస్తుందని వైరా ప్రాంతంలోని వైద్య విద్యను అభ్యసిస్తున్న ఎనిమిది మంది విద్యార్థిని విద్యార్థులకు 15 వేల రూపాయలు చొప్పున సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న 9 మంది విద్యార్థిని విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున మొత్తం 2 లక్షల పదివేల రూపాయలను అందజేస్తూ ఆయన మాట్లాడినారు. వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాప చంద్రకళ మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో గొప్పదని వైద్యులకు ఓపిక అవసరమని, వ్యసనాలకు దూరంగా ఉంటూ వైద్య విద్య ను కష్టంతో ఇష్టంగా అభ్యసిస్తూ వైద్యునిగా మంచి పేరు తెచ్చుకోవాలని వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది అని ఈ ఖర్చులకు గాను కొండబోలు సురేషు మరియు లలిత ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని సమాజానికి మంచి పరిణామం అని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీమతి ముళ్ళపాటి విజయలక్ష్మి, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వార్డు కౌన్సిలర్ ఫణిత సైదులు, ముళ్ళపాటి సీతారాములు, ఉంద్రు శ్యాంబాబు, సోమవరం గ్రామస్తులు బెజవాడ వీరభద్రశీ స్థానిక పాఠశాల హెచ్.ఎం శ్రీనివాసచారి, ఉపాధ్యాయసంఘాల బాధ్యులు గూడపాటి సూర్యం, పెనుగొండ ఉపేంద్రరావు, పాలపర్తి భాస్కర్, దొడ్డ వరప్రసాద్, వైరా సబ్ ఇన్స్పెక్టర్ పుష్పాల రామారావు, తోటకూర రఘు, పొదిల హరినాథ్ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాపా.అప్పయ్య ,

- వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా. సుధాకర్



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా, ఏన్కూరు మండలం నాచారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం నాచారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఉపముఖ్యమంత్రి కి స్వాగతం పలికి పలు అంశాలపై మాట్లాడారు.. ప్రజా సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క కి కాపా. అప్పయ్య , ఇమ్మడి లక్ష్మీనారాయణ మెమెంటో ను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గొల్లగూడెం మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, కాపా శ్రీనివాసరావు, మంగాపురం ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నంశెట్టి శ్రీకాంత్, షేక్ జమాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తల్లాడలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం..

ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

ఏన్కూర్ మండలంనాచారం గ్రామంలోని అద్భుత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ దర్శనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వెళ్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు తల్లాడలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రికి తమ అభినందనలు, శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మ రెడ్డి, సర్పంచ్ కటికి కిరణ్,నాగ నరసింహ రావు, ఉపసర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ, రుద్రాక్ష రామకృష్ణ చారి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుండేటి వీరా రెడ్డి, గోవింద్ శ్రీనివాసరావు, కాపా సుధాకర్, కోడూరు రాము, శీలం కోటారెడ్డి,తాళ్ల జోసెఫ్, పైడిపల్లి రవి, వేమిరెడ్డి వెంకట నారాయణ రెడ్డి, ముకర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు



ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం...





- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- రాష్ట్రంలో రూ. 2,500 కోట్లతో ఆలయాల అభివృద్ధి, గోదావరి పుష్కరాల పరివాహక ప్రాంతాల భక్తి క్షేత్రాలకు రూ. 2,000 కోట్లు.
- భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ. 276 కోట్లు, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి రూ. 354 కోట్లు మంజూరు..
- రూ. 90 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణం..
- రూ. 44 కోట్లతో ఎన్కూర్ నుండి నాచారం వరకు అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న రోడ్డు అభివృద్ధికి భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం

ఖమ్మం/ ఎన్కూరు, అక్టోబర్ 18(అక్షరం న్యూస్)

ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం. ఆర్థిక, విద్యుత్, ప్రణాళికా శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి ఏన్కురు నుండి నాచారం వరకు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఆపదమొక్కులవాడు, అడిగిన కోరికలు తీర్చే అద్భుత వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి రవాణా సౌకర్యార్థం బీటీ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ రహదారి నిర్మాణంతో భక్తుల రాకపోకలతో పాటు స్థానికంగా హోటళ్లు, వ్యాపారాలు పెరిగి ఆదాయ వనరులు పెంపొందుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి దాదాపు రూ. 2,500 కోట్లు వెచ్చిస్తోందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి కోసం రూ. 2,000 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. చారిత్రక భద్రాచల దేవస్థాన సమగ్ర అభివృద్ధికి రూ. 276 కోట్లు కేటాయించి నిధులు మంజూరు చేశామని, పిల్లల అక్షరాభ్యాస క్షేత్రమైన బాసర దేవాలయ అభివృద్ధికి రూ. 354 కోట్లు కేటాయించామన్నారు.తెలంగాణలో కోటి 15 లక్షల కుటుంబాలు వుండగా , అందులో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 71 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామన్నారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ, 53 లక్షల కుటుంబాలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించామని డిప్యూటీ సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, ఏటా రూ. 20 కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తు, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, దీనికోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించిందన్నారు.ప్రతి ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండవ విడత తో మొత్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం వేడివేడి అల్పాహారం ఇడ్లీ, పూరీ, ఉప్మా, పాలు/రాగి జావ అందిస్తున్నామన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో పోటీపడేలా ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు.సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయని, వచ్చే ఏడాది జూలై వరకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున, ప్రజలు, రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. నీటి సంరక్షణపై గ్రామీణ ప్రాంతాల్లో కళా బృందాలు, అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వచ్చే నెల నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణలో పుట్టిన ప్రతి కుటుంబానికి ధీమానిచ్చేలా ఇందిరమ్మ భీమా పథకం ను ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం గారు అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని, ప్రజలందరికీ దసరా, నవరాత్రి శు భాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు మిగిల్చినప్పటికీ, కష్టకాలంలో కూడా ఆర్థిక సర్దుబాటు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అందిస్తున్నామని తెలిపారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు తమ ఓట్లను విధిగా నమోదు చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతోందని, ప్రజలంతా ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీ కోరారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రాంత అభివృద్ధిలో రహదారుల నిర్మాణం అత్యంత కీలకమని, రహదారులు మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని అన్నారు. మారుమూల గ్రామాల వరకు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ఏ ప్రాంతంలోనైనా రోడ్డు వసతి మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. ఇది పోలీసింగ్ సేవల నిర్వహణకు, శాంతిభద్రతల పరిరక్షణకు, బందోబస్తు చర్యలకు ఎంతో సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రాంత ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని జిల్లా వాసిగా, అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం కృషి చేస్తున్నారన్నారు. గుడికి రోడ్లు వేయాలని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా రూ. 43 కోట్లు మంజూరు చేసి, ఏన్కూరు నుంచి నాచారం మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిధులు కేటాయించిన ఘనత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు.ఏన్కూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఐటిఐ, గోడౌన్ల మంజూరుతో పాటు ఈ ప్రాంతానికి కావలసిన రోడ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నాచారం నుండి జూలూరుపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని, ఈ రోడ్డు నిర్మాణం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాలోని దాదాపు 10 మండలాలకు లింక్ కలుగుతుందని, 7 నుండి 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని, రోడ్డు మంజూరుకు డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 3.38 కోట్ల బ్యాంక్ లింకేజీ బుణ చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు.అంతకుముందు డిప్యూటీ సీఎం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, టీజీఎన్పీడిసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, సిఈ సురేందర్, ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అజ్మీరా సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ దసరా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- మహిళల భద్రతకు ప్రత్యేక పోలీస్ బందోబస్తు -- డీసీపీ భూక్య రాంరెడ్డి



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 18 అక్షరం న్యూస్

బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి కోరారు. పండుగల సందర్భంగా మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ భూక్య రాంరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పట్టణ ప్రజలకు ముందస్తు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ సంబరాల సమయంలో మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, అమర్యాదగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బందులు కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా బతుకమ్మ ఆడుకునే సమయంలో మహిళలు చైన్ స్నాచింగ్ వంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని డీసీపీ భూక్య రాంరెడ్డి కోరారు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..మల్లు భట్టి విక్రమార్క



ఖమ్మం/ వైరా అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

వైరా నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వైరా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని వైరా ఆర్యవైశ్య ప్రముఖులు రంగా జనార్దన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇన్చార్జి గ్రంధి ప్రవీణ్ మరియు వారి బృందం మల్లు భట్టి విక్రమార్క ని కలిసి వైరాలో ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాన్ని నిర్మించాలని కోరుతూ ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొని రావడమైనది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆర్యవైశ్యులు యొక్క న్యాయమైన కోరికలను మరియు అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తానని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్చార్జ్ ఆత్మకూరి శేషగిరిరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మిట్టపల్లి శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు మైలవరపు శ్రీనివాసరావు,తాటికొండ రాము, మిట్టపల్లి భాస్కర్, అనుమోలు శ్రీనివాసరావు , మొరిశెట్టి జనార్ధన్ చేగోసి కొండ తదితరులు పాల్గొని తమ సమస్యలను వివరించారు.

వైరా మండలానికి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలి..

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు రైతుల వినతి..



ఖమ్మం/ వైరా అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

వైరా మండలంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు వైరా మున్సిపాలిటీ ఏడో వార్డు కౌన్సిలర్ పనితీ సైదులు ఆధ్వర్యంలో రైతు పైడిపల్లి శ్రీను, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను వైరాలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బోనకల్లు మండలంలో వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసిన విధంగానే వైరా మండలంలోనూ ఈ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. సోలార్ పంపుసెట్ల ఏర్పాటుతో రైతులకు సాగునీటి అవసరాలు తీర్చుకోవడంలో తోడ్పాటు లభిస్తుందని, వ్యవసాయ రంగం అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందుతుందని పేర్కొన్నారు.వైరా మండల రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు చెరుకూరి శ్రీను, సరిపూడి కోటేశ్వరరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

సూపర్ ఎల్‌నినో ఎదుర్కొనేందుకు రానున్న

8 నెలలకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేయాలి...

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి
- త్రాగునీటికి ప్రాధాన్యత... యాసంగిలో వరి సాగు చేయవద్దు..
- భూగర్భ జలాల పరిరక్షణకు అనుమతులు లేని బోర్లు, ఆటో స్టార్టర్ల వినియోగాన్ని అరికట్టాలి..
- విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో-ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు.
- చెరువుల నింపుదల, త్రాగునీటి నిల్వల సంరక్షణకు ప్రాధాన్యత..
- పశుగ్రాసం, పశువుల త్రాగునీటికి ఏర్పాట్లు చేయాలి..
- ఎల్నినో పరిస్థితులపై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉన్నతాధికారులతో సమీక్షించిన ప్రత్యేక అధికారి



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

సూపర్ ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు రానున్న 8 నెలల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, త్రాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణకు పకడ్బందీ కార్యాచరణ తయారు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు.ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి గత ఏడాది వర్షపాతంతో పోల్చి ప్రస్తుత ఏడాది మండలాల వారీగా వర్షపాత వివరాలను పరిశీలించాలని, లోటు వర్షపాతం నమోదైన మండలాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న మండలాలను గుర్తించి, రానున్న రోజుల్లో వాటి పరిస్థితిపై క్రమం తప్పకుండా అంచనాలు రూపొందించాలని, ఈ వివరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న 8 నెలలకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని, అవసరమైన సహకారం కోసం ప్రభుత్వానికి నివేదించాలని తెలిపారు. సమీక్షలో చర్చించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయ నున్నట్లు అన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు:

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో 5 మీటర్లు, ఎర్రుపాలెం మండలంలో 6.5 మీటర్లు, ఏన్కూరు, సత్తుపల్లి మండలాల్లో 5 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 10 మీటర్లకు పైగా భూగర్భ జలమట్టం తగ్గినట్లు పేర్కొన్నారు.భూగర్భ జలాలను పరిరక్షించేందుకు అనధికారికంగా బోర్లు వేయడం, నీటిని తోడుకోవడాన్ని నియంత్రించాలని, వ్యవసాయ బోర్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల వల్ల పంపులు, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, డీటీఆర్‌లపై భారం పెరిగే అవకాశం ఉన్నందున ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) రైతు వేదికల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామాల వారీగా మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే ప్రకటించాలని తెలిపారు. త్రాగునీటి అవసరాల కోసం మినహా కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వకూడదని, బోర్లు వేసే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని, వాల్టా చట్టాన్ని తహసీల్దార్లు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో తగ్గలేదని ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రబీ సీజన్‌లో వరి సాగు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపట్టకూడదని, రబీకి కాలువల ద్వారా నీటిని విడుదల చేయబోమని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా కూడా ఆశించిన స్థాయిలో అందక పోయే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని, రైతులు నష్టపోకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రస్తుత ఖరీఫ్ పంటల పరిరక్షణకు ప్రాధాన్యం:

ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలను కాపాడటం అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఒకటి లేదా రెండు తడులు అందిస్తే పంటను కాపాడగలిగే పరిస్థితుల్లో సమీపంలోని అన్ని నీటి వనరులను పరిశీలించి, సాధ్యమైన చోట నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. భక్త రామదాసు ప్రాజెక్టు పంపుల మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, వీలైనంత త్వరగా నీటి పంపింగ్ చేయాలని సూచించారు. ప్రాజెక్టుల గేట్లు, అవసరమైన చిన్నపాటి మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార చెరువుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా త్రాగునీటి అవసరాలకే వినియోగించాలని ప్రత్యేక అధికారి సూచించారు. చెరువుల్లో నీటిని నిల్వ ఉంచడం ద్వారా భూగర్భ జలమట్టం మెరుగుపడుతుందని తెలిపారు.

రానున్న 8 నెలలకు తాగునీటి ప్రణాళిక:

రానున్న 8 నెలల త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైతే ఒకటి లేదా రెండు తడులకు మాత్రమే నీటిని విడుదల చేయాలని, ప్రస్తుత పంటలను కాపాడిన అనంతరం మిగిలిన నీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు.పాలేరు, వైరా రిజర్వాయర్లకు త్రాగునీటి అవసరాల కోసం ఎప్పుడు, ఎంత నీటిని విడుదల చేయాలనే అంశంపై స్పష్టమైన షెడ్యూల్ రూపొందించాలని తెలిపారు. ఐటీసీ, హెచ్‌డబ్ల్యూపీ నీటి సరఫరా పరిస్థితులను సమీక్షించి, అవసరమైతే రేషనింగ్ విధానాన్ని అమలు చేయాలని, త్రాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి:

అనధికారిక విద్యుత్ కనెక్షన్ల కారణంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) అధిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని, వాటిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించడం వల్ల కూడా విద్యుత్ వ్యవస్థపై అదనపు భారం పడుతోందని, అటువంటి పరిస్థితులను నియంత్రించాలని తెలిపారు. డీటీఆర్‌లలో సమస్యలు తలెత్తిన వెంటనే మరమ్మతులు చేపట్టి, తక్కువ ఓల్టేజీ సమస్యలు రాకుండా చూడాలని, పంటలు విద్యుత్ కొరత వల్ల ఎండిపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. డీటీఆర్‌ల మరమ్మతులు, సామర్థ్య విస్తరణ పనులను సమాంతరంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.గ్రామాల వారీగా మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా సమయాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని, ఫీడర్లలో తక్కువ ఓల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పశువులకు నీరు, పశుగ్రాసం:

వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ప్రత్యేక అధికారి సూచించారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు నిర్మించేందుకు వీబీ జి రాంజీ పథకాన్ని వినియోగించుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఖమ్మం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ:లి సింగరేణి, కామేపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని, మిగిలిన 16 మండలాల్లో లోటు వర్షపాతం ఉందని వివరించారు. జిల్లాలో 10 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, 7 మండలాలను సాధారణ కరువు మండలాలుగా గుర్తించినట్లు వివరించారు.

భూగర్భ జలాల పరిస్థితి

ఖమ్మం జిల్లాలో సెప్టెంబర్ 2026 నాటికి భూగర్భ జలమట్టం 3.56 మీటర్లుగా నమోదైందని, గత ఏడాది ఇదే సమయంలో 2 మీటర్లుగా ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 2026లో భూగర్భ జల మట్టం 5.02 మీటర్లుగా ఉండగా, సెప్టెంబర్‌లో కురిసిన తుపాను వర్షాల కారణంగా మెరుగుదల కనిపించిందని వివరించారు.ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5.82 లక్షల ఎకరాలు కాగా, ఇందులో 2.41 లక్షల ఎకరాల్లో వరి, 2.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతున్నట్లు తెలిపారు. కల్లూరు, పెనుబల్లి, నేలకొండపల్లి, కూసుమంచి, తల్లాడ, వేంసూరు, వైరా, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, ముదిగొండ 10 మండలాల్లో 83 శాతం వరి విస్తీర్ణం ఉన్నట్లు వివరించారు.సీతారామ ఎత్తిపోతల పథకం ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా అనేక చెరువులను నింపినట్లు తెలిపారు. కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వైరా ప్రాంతాలు సీతారామ సాగర్ రాజీవ్ లింక్ కెనాల్ పరిధిలో ఉన్నట్లు వివరించారు.గోదావరి జలాల ద్వారా మొత్తం 110 చెరువులకు నీరు అందించగా, వాటిలో 101 చెరువులు పూర్తిగా, 2 చెరువులు 50 శాతం, 7 చెరువులు 75 శాతం నిండినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 244 చెరువుల్లో 125 చెరువులు 75 నుండి 100 శాతం, 49 చెరువులు 50 నుండి 75 శాతం, 35 చెరువులు 50 శాతం, మరో 35 చెరువులు 25 నుండి 50 శాతం నిండినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా మరిన్ని చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు పరిధిలో పెండింగ్‌లో ఉన్న చెరువులను నింపేందుకు నీటిని పంపింగ్ చేసే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లోని నీరు 84 రోజులకు సరిపోతుందని వివరించారు. ప్రస్తుత పంటలకు ఒకటి లేదా రెండు తడులు అందించడంతో పాటు వచ్చే వర్షాకాలం వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే నాగార్జున సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌ను 3 సార్లు, వైరా/లంకాసాగర్ ప్రాజెక్టును ఒకసారి నింపాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు రానున్న 8 నెలల త్రాగునీరు అవసరాల కోసం 4.5 టీఎంసీల నీరు అవసరమని వివరించారు.గత ఏడాది 271 డీటీఆర్‌లకు మరమ్మతులు చేపట్టగా, ఈ ఏడాది ఇప్పటివరకు 341 డీటీఆర్‌లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్ మాట్లాడుతూలి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 26.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 2026లో భూగర్భ జలమట్టం 7.76 మీటర్లుగా ఉండగా, అక్టోబర్ 2025లో 5.08 మీటర్లుగా నమోదైందని గత ఏడాదితో పోలిస్తే 2.68 మీటర్ల మేర తగ్గుదల నమోదైందని వివరించారు.తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 24,700 ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. దుమ్ముగూడెం వద్ద 1 మీటరు ఎత్తులో ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తే 1 టీఎంసీ వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉందని వివరించారు.ప్రస్తుతం ఉద్యాన పంటలు ఎండిపోయే పరిస్థితి లేదని, ఖరీఫ్‌లోనూ పెద్దగా ఇబ్బందులు లేవని తెలిపారు. రానున్న రోజుల్లో వర్షాధార పంటలు, పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని వివరించారు. గత ఏడాది 175 డీటీఆర్‌లకు, ఈ ఏడాది 214 డీటీఆర్‌లకు మరమ్మతులు చేసినట్లు వివరించారు.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్, భూగర్భజల, విద్యుత్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మహేష్ బాబు -- రాజమౌళి 'వారణాసి' మూవీ విడుదల వాయిదా?

త్వరలోనే కొత్త తేదీ ప్రకటన!



సూపర్ స్టార్ మహేష్ బాబు, టాలెంటెడ్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' చిత్రానికి సంబంధించి సోషల్ మీడియాలో ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతోంది. అనూహ్యం గా ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడినట్లు ఫిలిం సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న (ఉగాది కానుకగా) ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే అధికారికంగా ప్రకటించారు. అయితే, సినిమా గ్రాండ్ విజువల్ ఎఫెక్ట్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు ఇతర లాజిస్టికల్ కారణాలరీత్యా ఈ విడుదల తేదీని వాయిదా వేయాలని చిత్రబృందం యోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే చిత్ర యూనిట్ నుంచి ఈ వాయిదాపై స్పష్టత రానుందని, త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజమౌళి మార్క్ గ్లోబల్ స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉండటంతో, దీనికి సంబంధించిన అఫీషియల్ అప్‌డేట్ కోసం మహేష్ బాబు అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. 'స్పిరిట్' నుంచి కొత్త పోస్టర్, రిలీజ్ డేట్ వచ్చేసింది



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'స్పిరిట్'. ఈ సినిమాకు సంబం ధించి మేకర్స్ తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్ మరియు అప్‌డేట్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఎప్పుడూ చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో ప్రభాస్ బ్లాక్ క్యాప్, స్టైలిష్ గాగుల్స్‌తో అత్యంత రగ్డ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మార్క్ యాక్షన్ అండ్ మాస్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా, ఈ మూవీపై ఇప్పటికే సినిమా సర్కిల్స్‌లో విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించి అభిమానులకు మెగా ట్రీట్ అందించింది. ఈ భారీ యాక్షన్ డ్రామాను 2027 దీపావళి కానుకగా అక్టోబర్ 29న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన టాలెంటెడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు టీ-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సందీప్ రెడ్డి వంగా నుంచి వస్తున్న సినిమా కావడంతో 'స్పిరిట్'పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. సరికొత్త యాక్షన్ ప్యాక్డ్ కథాంశంతో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు...

సల్మాన్ ఖాన్‌తో పనిచేసే వారే టార్గెట్?

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహు ప్రాంతంలో బైక్‌లపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు.. టైగర్ వాహనంపై కాల్పులు జరిపారు. ఈ ఘటనపై కారులో ఉన్నవారు అప్రమత్తం కావడంతో టైగర్ సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఆయన కారు డ్రైవర్‌తో పాటు, మరో ఆటో డ్రైవర్ గాయపడ్డారు.ఈ ఘటనపై జుహు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనాస్థలిలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాల్పుల స్పందించిన ముంబై పోలీసులు.. టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి తూటా గాయాలు కాలేదని స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో బెదిరింపు పోస్ట్

ఈ కాల్పుల ఘటనకు పాల్పడింది తామేనంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు సంబంధం ఉన్నట్లు చెప్పబడుతున్న వ్యక్తుల పేరుతో సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వెలుగులోకి వచ్చింది. అనిల్ పండిట్, అనిల్ హర్మన్ సంధు ఈ దాడి వెనుక ఉన్నారని ఆ పోస్ట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. మేము అతడికి ఫోన్ చేసి విషయం వివరించడానికి ప్రయత్నించాం. కానీ అతడు అర్థం చేసుకోలేదు. అందుకే ఈరోజు అతడికి సరైన రీతిలో వివరించాం" అనే అర్థం వచ్చేలా ఆ పోస్ట్‌లో వ్యాఖ్యలు ఉన్నాయి. ముంబై చిత్ర పరిశ్రమలో తమ మాట వినని వారు లేదా సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారు తదుపరి లక్ష్యమవుతారని ఆ పోస్ట్‌లో బెదిరించినట్లు సమాచారం. ఈ బెదిరింపు నేపథ్యంలో బాలీవుడ్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. అయితే, కాల్పులకు గల కారణాలు, దాడి వెనుక ఉన్న వ్యక్తుల వివరాలపై పోలీసుల దర్యాప్తులో మరిన్ని అంశాలు వెల్లడికావాల్సి ఉంది.



2014లో బాలీవుడ్ ఎంట్రీ

టైగర్ ష్రాఫ్ ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్ కుమారుడు. 2014లో 'హీరోపంతి' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. యాక్షన్ సన్నివేశాలు, స్టంట్లతో గుర్తింపు పొందారు. ఇటీవల ఆయన నటించిన 'బాఘీ 4'లో సంజయ్ దత్, సోనమ్ బజ్వా, హర్నాజ్ సంధు తదితరులు నటించారు.

'కామ్రేడ్ కళ్యాణ్'తో సంచలనం..

తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ కొట్టిన దర్శకుడు జానకిరామ్ మారెళ్ల



టాలీవుడ్‌లో తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకోవడం కొందరికే సాధ్యమ వుతుంది. అలాంటి అరుదైన ఘనతను సాధించి, ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు యువ దర్శకుడు జానకిరామ్ మారెళ్ల. శ్రీవిష్ణు హీరోగా తెరకెక్కిన 'కామ్రేడ్ కళ్యాణ్' చిత్రంతో ఆయన బాక్సాఫీస్ వద్ద తొలి ప్రయత్నంలోనే భారీ విజయాన్ని అందుకుని టాలీవుడ్ వర్గాల దృష్టిని పూర్తిగా ఆకర్షించారు. నక్సలిజం మరియు విప్లవ నేపథ్యంతో కూడిన సీరియస్ పాయింట్‌ను ఎంచుకున్నప్పటికీ, దానిని పూర్తిగా వినోదాత్మకంగా మలచడంలో జానకిరామ్ తన మేకింగ్ ప్రతిభను చాటుకున్నారు.ఈ సినిమాలో ఆయన బలంగా ఎలివేట్ చేసిన అంశం కామెడీ టైమింగ్. పెద్దగా క్లిష్టమైన సన్నివేశాలపై ఆధారపడకుండా, సింపుల్ వన్‌లైనర్స్, సహజమైన సంభాషణలు మరియు సందర్భానుసారంగా వచ్చే కామెడీతో థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. కేవలం నవ్వులకే పరిమితం కాకుండా, కథకు తగినట్లుగా కమర్షియల్ యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా జానకిరామ్ అద్భుతంగా తెరకెక్కించారు. యాక్షన్ సన్నివేశాలను రిచ్‌గా, ఆకట్టుకునే విజువల్స్‌తో రూపొందిస్తూ తనలోని టేకింగ్ స్కిల్స్‌ను ప్రదర్శించారు. కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు యాక్షన్ ఎపిసోడ్స్‌తో థ్రిల్ కలిగించడం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.ఇక మొదటి సినిమాతోనే వినోదానికి పెద్దపీట వేస్తూ, ఎంచుకున్న కథను అత్యంత ఆసక్తికరంగా తెరకెక్కించిన విధానంతో జానకిరామ్ మంచి ప్రశంసలు అందుకున్నారు. ప్రేక్షకులను ఎక్కడా బోర్ కొట్టించకుండా సన్నివేశాలను తీర్చిదిద్దడంలో తనకున్న పట్టును ఆయన నిరూపించుకున్నారు. కామెడీ, యాక్షన్ రెండింటినీ సమపాళ్లలో బ్యాలెన్స్ చేస్తూ ఒక కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను అందించడంలో తన సత్తా ఏంటో నిరూపించుకున్నారు. 'కామ్రేడ్ కళ్యాణ్' సాధించిన ఈ అద్భుతమైన విజయంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జానకిరామ్ మారెళ్ల పేరు మారుమోగుతోంది. ఇదే ఊపును కొనసాగిస్తూ భవిష్యత్తులో ఆయన మరిన్ని ఆసక్తికరమైన, వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. తొలి సినిమాతోనే తన ప్రతిభను చాటుకున్న ఈ టాలెంటెడ్ డైరెక్టర్ తదుపరి ప్రాజెక్ట్‌లపై టాలీవుడ్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఘనంగా 9వ వార్డులో బతకమ్మ వేడుకలు..



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కమ్మవారి కళ్యాణ మండపంలో దసరా పర్వదినం సందర్భంగా స్థానిక మహిళలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకల ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ కమ్మ జనసేవా సమితి అధ్యక్షుడు కట్టా కృష్ణార్జున రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా బతుకమ్మ ఆట పాట ఆడారు బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం అని అన్నారు అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి అందాలని కోరారు. బతుకమ్మ ఉత్సవాలను తొమ్మిది రోజులపాటు జరుపుకోవడం మంచి శుభప్రదం అని అన్నారు .ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు కమ్మ జన సేవా సమితి కమిటీ సభ్యులు. పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ను మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

వైరాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ , 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయ సీతారాములు మర్యాదపూర్వకంగా కలిశారు.

6 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ..



ఖమ్మం/వైరా టౌన్ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన 6 టు

6 క్రికెట్ టోర్నమెంట్‌ను ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ , 7వ వార్డు కౌన్సిలర్ పనితి సైదులు ఉంద్రు శ్యాంబాబు , పొదిలి హరినాథ్ , పువ్వాళ్ల రాము , తోటకూర శ్రీకాంత్ తో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టిన సర్పంచ్

సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపిన రైతులు.

గ్రామ అభివృద్ధికీ కృషి చేస్తా..

సర్పంచ్ వనిగండ్ల మాధవరావు.



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 18 (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని కేశవపురం గ్రామపంచాయతీలో స్థానిక రైతుల వినతి మేరకు గ్రామం నుంచి మిట్టపల్లి వెళ్లే రహదారి చెట్లతో నిండి రైతులకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో స్థానిక సర్పంచ్ వనిగండ్ల మాధవరావు రహదారి మరమ్మతుల పనులను ఆదివారం ప్రారంభించారు. గత కొంతకాలంగా రహదారి కి ఇరువైపులా ఉన్న చెట్లు రహదారిపైకి వచ్చి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సర్పంచ్ మాధవరావు కు తెలియజేయడంతో స్పందించిన సర్పంచ్ జెసిబి సాయంతో రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టారు. రైతులు తమ సమస్యను పరిష్కరించినందుకుగాను గ్రామ సర్పంచ్ మాధవరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ మాధవరావు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. మండలంలో కేశవపురం గ్రామపంచాయతీ అభివృద్ధి చెందడానికి అధికారుల సహకారంతో ముందుకు వెళ్తానని ఆయన అన్నారు. గ్రామ ప్రజలకు, మహిళాలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు రు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాధం రమేష్,వార్డు సభ్యులు చిన్నంశెట్టి శ్రీకాంత్,పసుపులేటి రామకృష్ణ,వనిగండ్ల పద్మ,కట్టా భద్రమ్మ, గ్రామ పెద్దలు చావా నాగేశ్వరావు, మన్నెపల్లి రామారావు, చిన్నంశెట్టి శ్రీనివాసరావు,కట్టా కృష్ణమూర్తి,వనిగండ్ల కృష్ణమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

షఫాలీ సునామీ.. స్మృతి మంధాన

మెరుపు ఫినిషింగ్..

8.5 ఓవర్లలోనే జింబాబ్వేపై టీమిండియా విధ్వంసం!

జింబాబ్వేతో రెండో టీ20లో భారత మహిళల జట్టు అదర గొట్టింది. తొలుత బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే ఛేదించింది. షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విరుచుకుపడగా.. కెప్టెన్ స్మృతి మంధాన 23 బంతుల్లో 40 పరుగులతో మెరిపించింది.

బౌలింగ్‌లో కట్టడి.. 100 పరుగులకే జింబాబ్వే పరిమితం

మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో సుమారు 100 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో చిపో ముగేరి-తిరిపానో 32 బంతుల్లో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. జోసెఫిన్ న్కోమో 29 బంతుల్లో 24 పరుగులతో పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు.

భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వేను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ బెలవ్డ్ బిజాను ఔట్ చేయగా.. నందిని శర్మ కూడా వికెట్ సాధించింది. యువ క్రికెటర్ నికి ప్రసాద్ తన అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి బంతికే వికెట్ తీసి ఆకట్టుకుంది. చిపో ముగేరి-తిరిపానోను రిచా ఘోష్ క్యాచ్ పట్టడంతో నికి ప్రసాద్‌కు తొలి వికెట్ దక్కింది. అనంతరం నికి ప్రసాద్ మరో వికెట్ సాధించడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ మరింత ఒత్తిడిలో పడింది.

భారత ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారు. రనౌట్‌తో పాటు క్యాచ్‌ల ద్వారా జింబాబ్వే బ్యాటర్లను పెవిలియన్‌కు పంపారు. దీంతో జింబాబ్వే భారత్ ముందు కేవలం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది.

ఆరంభం నుంచే షఫాలీ దూకుడు

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్ నుంచే షఫాలీ బౌండరీలతో విరుచుకుపడింది. ఆరంభంలోనే ఫోర్, సిక్స్‌తో జింబాబ్వే బౌలర్లపై ఒత్తిడి పెంచింది. మరోవైపు



మంధాన ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది.

రెండో ఓవర్‌లో మంధాన వరుసగా రెండు ఫోర్లు కొట్టగా.. ఆ తర్వాత షఫాలీ కూడా తనదైన శైలిలో దూకుడు కొనసాగించింది. మూడో ఓవర్‌లో సిక్స్ బాదిన షఫాలీ.. నాలుగో ఓవర్‌లోనూ బౌండరీతో సత్తా చాటింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య భాగస్వామ్యం వేగంగా పెరిగింది.

నాలుగో ఓవర్‌లో మంధాన వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో భారత స్కోరు ఒక్కసారిగా ఊపందుకుంది. ఐదో ఓవర్‌లో షఫాలీ వర్మ వరుస బౌండరీలతో విరుచుకుపడింది. ఆ ఓవర్‌లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులు రావడంతో జింబాబ్వే బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి ఆరు ఓవర్లలో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఈ ప్రదర్శన కూడా చోటు దక్కించుకుంది. జింబాబ్వే బౌలర్లకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా షఫాలీ, మంధాన పరుగుల వరద పారించారు.

24 బంతుల్లోనే షఫాలీ అర్ధశతకం

షఫాలీ వర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించింది. బౌలర్ ఎవరన్నది పట్టించుకోకుండా బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడింది. ఏడో ఓవర్‌లో సిక్స్ బాది కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసింది. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టి జట్టును విజయానికి మరింత చేరువ చేసింది.

చివరకు 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ.. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో ఆకట్టుకుంది. బెలవ్డ్ బిజా బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో క్యాచ్ ఇవ్వడంతో ఆమె ఇన్నింగ్స్ ముగిసింది. అప్పటికే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. షఫాలీ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనుష్క శర్మతో కలిసి మంధాన లక్ష్యాన్ని పూర్తి చేసింది. మంధాన తన దూకుడును కొనసాగిస్తూ 23 బంతుల్లో 40 పరుగులు సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లో ఫోర్లు, సిక్సర్లతో పాటు చక్కటి టైమింగ్ కనిపించింది. చివరికి ఒలిండర్ చారే బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది మంధాన మ్యాచ్‌ను ముగించింది.

మందుకు బానిసనై 26 రోజులు పునరావాస కేంద్రంలో ఉన్నా..

- **విడాకుల తర్వాత మద్యానికి బానిసైనట్లు అంగీకరించిన చాహల్**
- **26 రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉన్నట్లు వెల్లడి**
- **భార్య ధనశ్రీ వర్మతో విడాకుల తర్వాతే సమస్య తీవ్రమైందని వ్యాఖ్య**
- **రిహాబ్ తర్వాత మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా మారానన్న చాహల్**
- **క్రికెట్ కెరీర్‌ను కాపాడుకోవడానికే చికిత్స తీసుకున్నట్లు స్పష్టీకరణ**

టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించాడు. భార్య, కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మతో విడాకుల తర్వాత తాను మద్యపానానికి బానిసయ్యానని, దాని నుంచి బయటపడేందుకు 26 రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స తీసుకున్నానని తెలిపాడు. ఈ కఠినమైన దశను అధిగమించి ఇప్పుడు మానసికంగా, శారీరకంగా ఎంతో మెరుగ్గా ఉన్నానని చాహల్ పేర్కొన్నాడు.

భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాకు ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో చాహల్ ఈ విషయాలను పంచుకున్నాడు. "2022 నుంచి మేమిద్దరం వేర్వేరుగా ఉన్నాం. 2025 మార్చిలో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నాం. ఆ తర్వాత, ముఖ్యంగా గత ఏడాది కౌంటీ క్రికెట్ ఆడిన తర్వాత నా మద్యపానం హద్దులు దాటింది. అందుకే రిహాబ్ సెంటర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. అక్కడ 26 రోజులు ఉన్నాను. ఇప్పుడు దానిని ఎలా నియంత్రణలో ఉంచుకోవాలో నాకు తెలుసు" అని చాహల్ వివరించాడు.

రిహాబ్‌లో ఉండటం వల్ల తనలో భావోద్వేగ సమతుల్యత, పరిణతి పెరిగాయని చాహల్ తెలిపాడు. శారీరకంగానూ ఎంతో ఫిట్‌గా మారానని, గత ఐపీఎల్ సీజన్‌లో తాను మళ్లీ 30 ఏళ్ల వాడిలా చురుగ్గా కదిలానని ఆనందం వ్యక్తం చేశాడు. 2011 ఐపీఎల్ ఆడే రోజుల్లో సరదాగా స్నేహితులతో కలిసి మద్యం తీసుకోవడం మొదలుపెట్టానని, అయితే విడాకుల తర్వాత అది వ్యసనంగా మారిందని అన్నాడు. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తల వల్ల తీవ్రమైన ఆందోళన, పానిక్ ఎటాక్స్ కూడా ఎదుర్కొన్నట్లు చాహల్ వెల్లడించాడు. తాను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే క్రికెట్ కెరీర్‌కు ఈ వ్యసనం వల్ల నష్టం జరుగుతుందని గ్రహించానని, అందుకే కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతుతో చికిత్స తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశాడు. అప్పట్లో తన సహచర ఆటగాడు ఏబీ డివిలియర్స్ జీవితంలో సమతుల్యత ఎంత ముఖ్యమో చెప్పిన మాటలను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నాడు.



అమెరికాలో భారత ఐఆర్ఎస్ అధికారిణి సంచలనం.. పవర్‌లిఫ్టింగ్‌లో 3 స్వర్ణాలు!

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు గెల్చిన ఏక్తా బిష్ణోయ్

ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా రికార్డు

కోచ్ వీసా తిరస్కరణకు గురవడంతో వీడియో కాల్ ద్వారా సూచనలు

మొత్తం 362.5 కిలోల బరువు ఎత్తి జపాన్, కెనడా క్రీడాకారులపై విజయం

ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు.ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం.అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు.గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్నాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం" అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.



హైదరాబాద్ 275 ఆలౌట్



విజయవాడ : ఆంధ్రతో రంజీ ట్రోఫీ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తక్కువ స్కోరుకే పరిమితం అయింది. ఆదివారం మొదలైన గ్రూప్-బీ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిరాజ్‌సేన తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (67), తన్మయ్ అగర్వాల్ (42) తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించి మంచి పునాది వేసినా ఈ జోడీ విడిపోయిన తర్వాత హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో రాహుల్ రాదేశ్ (58 నాటౌట్) మాత్రమే ఆకట్టుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో విజయ్ 4, లలిత్ మోహన్, సౌరభ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య ఆంధ్ర తొలి రోజు చివరకు వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది.

గిల్ ఒక్క పరుగుకే ఔట్

న్యూజిలాండ్ పర్యటనకు ముందు పంజాబ్ జట్టు తరఫున రంజీ బరిలో నిలిచిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (1) నిరాశ పరిచాడు. చత్తీస్‌గఢ్‌తో మొదలైన మ్యాచ్‌లో ఐదు బంతులాడి ఒకే పరుగు చేసిన అతను లెఫ్టార్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. గిల్ ఫెయిలైనా ఉదయ్ సహరన్ (106 బ్యాటింగ్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (62) సత్తా చాటడంతో పంజాబ్ తొలి రోజు ఆటను 269/4తో ముగించింది.

అట్టహాసంగా పారా ఆసియాడ్ ఆరంభం.. ప్రారంభ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా భారత బృందం



నగోయా (జపాన్) : ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. 5 వేల ఏండ్ల నాటి మానవ నాగరికత వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక బ్లేజర్లను ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పారా షట్లర్ ప్రమోద్ భగత్, పారా స్ప్రింటర్ సిమ్రాన్ శర్మ త్రివర్ణ పతాకాలను చేతబూని జట్టును ముందుండి నడిపించారు.భారత పారా అథ్లెట్లు ధరించిన అధికారిక బ్లేజర్‌లపై సింధు నాగరికత ముద్రలు, ప్రాచీన లిపి నమూనాలు ముద్రించారు. అలాగే కాలర్ భాగంలో సప్తసింధు నదుల ప్రాంతాన్ని స్మరిస్తూ డిజైన్ చేయగా, జేబుపై త్రివర్ణ పతాకాన్ని అలంకరించారు. ఈ క్రీడల్లో భారత్ తరఫున 11 విభాగాల్లో మొత్తం 168 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా గేమ్స్‌లో 45 దేశాల నుంచి సుమారు 3వేల మంది పారా అథ్లెట్లు పోటీ పడుతున్నారు.

ఆర్చరీ లీగ్ చాంప్ మైటీ మరాఠాస్.. రన్నరప్‌తో సరిపెట్టిన కాకతీయ



హైదరాబాద్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌లో మైటీ మరాఠాస్ చాంపియన్‌గా నిలిచింది. స్థానిక జట్టు కాకతీయ నైట్స్‌ను ఓడించి ట్రోఫీ కైవసం చేసుకుంది. పీపుల్స్ ప్లాజా వద్ద ఆదివారం జరిగిన ఫైనల్లో మరాఠాస్ జట్టు 6-2తో కాకతీయకు చెక్ పెట్టింది. ఫైనల్లో ఏపీ కుర్రాడు రికర్వ్ స్టార్ బొమ్మదేవర ధీరజ్ 80కి 79 పాయింట్లతో సత్తా చాటితే మైక్ షోసర్ పర్ఫెక్ట్ 80 పాయింట్లతో మరాఠాస్ విజయంలో కీలకంగా నిలిచారు. తుదిపోరులో ఇరు జట్లూ తొలి సెట్‌లో 75-75తో సమంగా నిలవగా.. రెండో సెట్‌ను ఒక్క పాయింట్ తేడాతో నెగ్గిన మరాఠాస్ కీలక ఆధిక్యం అందుకుంది.మూడో సెట్ కూడా సమం అవ్వడంతో ఆట షూటాఫ్‌కు వెళ్లేలా కనిపించింది. కానీ, నాలుగో సెట్‌లో నైట్స్ ఆర్చర్లు గురి తప్పగా.. మరాఠాస్ ఒత్తిడిలోనూ అద్భుతంగా ఆడింది. ఈ సెట్‌ను 79-74తో గెలిచిన మరాఠాస్ మ్యాచ్ గెలిచి విజేతగా నిలిచింది. రెండు గంటల ముందు ఇరు జట్ల మధ్య క్వాలిఫయర్ పోరులో హిట్ ఆర్ మిస్ షూటాఫ్‌లో నైట్స్ 2-0తో మరాఠాస్‌ను ఓడించి నేరుగా ఫైనల్ చేరింది. అయితే, ఎలిమినేటర్‌లో మరాఠాస్ 5-3తో పృథ్వీరాజ్ యోధాస్‌పై నెగ్గి ఫైనల్ చేరుకొని కాకతీయపై ప్రతీకారం తీర్చుకొని ట్రోఫీని ముద్దాడింది. ధీరజ్ బెస్ట్ రికర్వ్ ఆర్చర్‌గా నిలిచాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609